# చీరకట్టు చూడు

ముకుందరావుకు ముళ్ళమీద కూచున్నట్టుగా ఉంది. కుర్చీలోంచి లేచి గదిలో ఆ మూలనుంచి ఈ మూలకీ, ఈ మూలనుంచి ఆ మూలకీ తిరగడం ప్రారంభించాడు. గోడ గడియారం గిల్లుకుంటూ టికు టికు లాడుతోంది. చూసి చూసి అతగాడికి మరీ చిరాకేసింది.

"రామామణి!" అని పిలిచాడు.

లోపల్నించి సమాధానం రాలేదు.

"బంగారు పిచ్చుకా!" అని అరిచాడు.

అయినా రవ్వంతైనా అలికిడి లేదు.

ఇక నిలబడలేక, తలుపుతోసుకుని లోపలకు వెళ్ళాడు.

అక్కడ, కట్టుకొన్నది కంచిపట్టు చీరను చుట్టబెట్టుకోలేక సతమతమైపోతోంది. సవ్వడి కాగానే చట్టున తలెత్తిచూచి మగవాని నీడ తనమీద పడగానే సిగ్గుతో ముడుచుకపోయింది.

“ఏవోయ్! నీ సింగారింపు కాలే?” అనేసి ముకుందరావు నవ్వాడు.

ఆ పిల్ల చురుకుచూపులు చూచింది.

“ఆడపిల్లలు ఏ సొంతప్రదేశంలో చీర కట్టుకుంటూ ఉంటే చెప్పాపెట్టకుండా, చేసుకున్నవాడైనా రావడం తప్పే కావచ్చుగా! అవతల టీ పార్టీకి వేళమించితే టీ నీళ్ళ మాటటుంచి అసలువాళ్ళే కనిపించకపోతే ప్రమాదం ఉంది. అందుకే నిన్ను హెచ్చరించడానికివస్తే - నువ్వు కంచిపట్టు చీరతో కంగారుపడుతున్నావు. పట్టు పట్టు చేసుకున్నవాడికి తప్పదుమరి–” అంటూ చీర చేతిలోకి తీసుకుని, పుత్తడిబొమ్మలాంటి పూర్ణిమ సిగ్గుతో నగమైపోతూంటే, ముకుందరావు అంతంగా, అతి నాజూగ్గా, అలవోకగా చీర కట్టేశాడు.

పూర్ణిమ ఆ తరువాత పకపకా నవ్వేసింది.

“భలేవారే మీరు! చీరకట్టడం కూడా చేతనావన్నమాట! మరి ఇంతకాలము చెప్పారుకారేం? భలే గొప్పగా కట్టేశారే!” అని పొగడడం ప్రారంభించింది.

ముకుందరావు గర్వపడలేదు, నవ్వలేదు, “ముందు బయలుదేరవోయ్!” అనిమాత్రం అన్నాడు.

ఆ జంట చక్కా గా కారులో కూచుని ఆంజనేయరావు గారింటికొచ్చేసరికి సరిగా పార్టీ ప్రారంభం అవబోతూ వుంది.

ఇక్కడ ఆంజనేయరావుగారంటే ఎవరో చెప్పక తప్పదు. ఆయన ముకుందరావు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డిపార్టుమెంట్‌కు డైరెక్టర్! వారి ఏకైక పుత్రికారత్నం పుట్టినరోజు పండుగ సందర్భంగా ఆనాడు విందేర్పాటు చేయబడింది. ముకుందరావు దంపతులనుచూచి ఆంజనేయరావుదంపతులు అమితానంద పడ్డారు. పూర్ణిమ అందిచ్చిన గిఫ్టుప్యాకెట్ అందుకుంటూ, సుకుమారి మనసు కెవ్వున అరిచింది.

“అబ్బో! చీర ఎంత అందంగా కట్టుకున్నారు! అద్భుతంగా ఉంది. మా కొంచెం నేర్పరూ! ఈ కుచ్చెళ్ళు ఎంత అందంగా తీర్చిదిద్దారు. ఓహో! ఏం నేర్పరితనం!” అంటూ ఆ పిల్ల పొగడేసరికి పూర్ణిమ ఉబ్బితబ్బిబ్బై ఓర కంట చూచింది. అతగాడు అసలు ఆ సంగతి పట్టించుకోకుండా—అధికారిగారితో ఆఫీసు విషయాలు మాట్లాడుతున్నాడు.

పార్టీకి హాజరైన అబలలందరూ పూర్ణిమ చుట్టూ చేరి సంకీర్తనం ప్రారంభించారు. నోళ్ళు నొప్పిపుట్టే వరకూ

పొగిడారు. ఇంతాచేసీ, వారు మెచ్చుకున్నదల్లా ఆ చీర బాగుందని కాదు-చీర కట్టిన తీరు గొప్పగా ఉందనీ, ముఖ్యంగా ఆంజనేయరావుగారి కూతురు సుమన-ఆ గంట సేపూ అదే విషయంపై అనర్గళంగా పొగడ్తలు కురిపించేసింది.

తీయగా తిని, చల్లగా తాగి, గంపెడు వక్కపొడి నమిలి అతిథులంతా చీకటితో బాటు ఎవరిళ్ళకు వారు జేరుకున్నారు. రాత్రి పదకొండో గంట కొడుతూండగా, పూర్ణిమ ముకుందరావును ముచ్చటగా చూస్తూ "పార్టీకి వచ్చిన వాళ్ళంతా మీ నేర్పును తెగ మెచ్చుకున్నారు సుమండీ! అయినా-నాకు తెలియకడుగుతాను- ఇంత చక్కగా చీర కట్టడం ఎలా నేర్చుకున్నారండీ!" అని అడిగింది".

ముకుందరావు నవ్వేసి ఊరుకున్నాడు.

ఆ మరునాడు, మధ్యాహ్నం వేళ-ఒంటరిగా ఉన్నప్పుడు పూర్ణిమ నిన్నటి మాదిరి చీరకట్టుకోవాలని ప్రయత్నించి, విఫలత్వం విసుగుని కొని తేగా కుర్చీలో కూలబడింది. ఆ సమయంలో ఆమెకు భర్తమీద చెప్పలేనంత ఈర్ష్య కలిగింది, కోపం వచ్చింది. అచ్చు మగాడు! ఆడదానికన్న మిన్నగా, అందంగా చీరకట్టడం నేర్చుకున్నాడు. పూర్ణిమకు కోపం, ఈర్ష్య కలగడంలో ఆశ్చర్యంలేదు!

ఆలోచించగా, ఆలోచించగా ముకుందరావుకు చీరకట్టే నేర్పు అలవడడం చాలా ఆశ్చర్యంగా అనిపించిందామెకు. అతివలతో అతి సాన్నిహిత్యం కలిగితేనే తప్ప వసనా లంకరణలాఘవం అబ్బదు.

ఆ రాత్రి ఆమె అతగాడిని నిలదీసి అడిగేసింది.

“మీరు నిజం చెప్పేవరకూ వదలను. పుట్టుకతో నాకు రానిది మీకెలా అలవడింది! నిజం చెప్పకపోతే నా మీద ఒట్టే.”

ముకుందరావు ముసి ముసి నవ్వులు నవ్వేశాడు. దాంతో ఆమెకు మరీ పట్టుదల కలిగింది. ఏదో రహస్యమంటూ లేకపోతే దాచుకోవలసిన అవసరం ఏముంటుంది!

“ఏమైనా గానీ మీరు నిజం చెప్పి తీరాలి. ఏ రంగసాని నేర్పింది మీకు సరాసరి ఆవిడ దగ్గరకెళ్ళి నేర్చుకుంటాన్నేను” అని అడిగింది పూర్ణిమ.

ముకుందరావు ముందుగా ఆశ్చర్యపోయాడు. ఆ తరువాత యిట్లా చెప్పాడు.

“చెప్పబోయేదంతా చెవులప్పగించి విను. ఇప్పుడు నేను గజిటెడ్ ఆఫీసరు నన్నమాట నీకు తెలుసు. కాని, మన పెళ్ళికాక ముందు నేను ఎలా బతికానో నీకు తెలీదు. మెట్రిక్యులేషన్ తరువాత బి ఏ. చదవడానికి నేను పడ్డ పాట్లు వింటే రంగసానులూ, విందుభోజనాలూ, అన్న మాటలే నీ నోటికి రావు. మెట్రిక్యులేషన్ తరవాత నాన్నా, అమ్మా నన్ను అన్యాయం చేస్తే బొంబాయి వెళ్ళిపోయి. ఓ బట్టల కొట్లో చేరాను. రాత్రిపూట ఏదోలా కాలేజీకి వెడుతూ

చదువుకున్నాను! ఆ తరువాత మీ నాన్న దయవల్ల ఇంత మంచి ఉద్యోగమూ పూర్ణిమ అనే పుత్తడిబొమ్మ దొరికాయి."

మధ్యలో అడ్డమొచ్చి "ఈ కథంతా నా కెందుకు? అసలు సంగతి చెప్పండి!" అని నిలదీసింది పూర్ణిమ.

"అదే చెబుతున్నాను అబలా! నేను బట్టల కొట్లో పని చేసే రోజుల్లో. అక్కడున్న బొమ్మలకు చీరలు కట్టిన ఈ చేతులు ఈ నాడు ఈ బొమ్మకు చీరనుకట్టాయి—"

పూర్ణిమ ముందు ఆశ్చర్య పోయింది. ఆ తరువాత మాంతం అతని నీడతో కలిసి. మరి అతన్నిమాట్లాడ అనీకుండా చేసింది

(జ్యోతి,